క్లుప్తంగా

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి



పెనమలూరు: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలని పెనమలూరు సీఐ టీవీ వీ.రామారావు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉంటే షీట్లు తొలగిస్తామన్నారు. త్వరలో ఎన్నికలు జరుగు తున్నందున రౌడీషీటర్లు క్రమశిక్షణతో మెలగాలన్నారు. రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని తెలిపారు.

సొసైటీలో సిద్ధంగా ఎరువులు



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో రబీ సీజన్‌కు అవసరమైన ఎరువులను సిద్ధంగా ఉన్నాయి. 20:20: 20-0 ఎరువులు 346 టన్నులు, డీఏపీ 200 టన్నులు, సూపర్ 28 టన్నులు, పొటాష్ 75 టన్నులు, 10-26-26 ఎరువు 92 టన్నులు, 14-35-14 ఎరువు 196 టన్నులు, యూరియా 1600 టన్నులు నిల్వ ఉన్నట్టు సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి తెలిపారు. గ్రామంలోని రైతులకు ఎరువుల కొరత లేకుండా అందుబాటులో ఉంచామన్నారు. ఈ రబీ సీజన్లో మండలంలో 4 వేల ఎకరాల్లో వరి, తెల్లజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు సరిపడినంతగా ఉన్నాయని ఏఓ రంగనాథ్‌బాబు తెలిపారు.

జానపద కళారూపాలను ఆదరించాలి



విజయవాడకల్చరల్: జానపద కళారూపాలను ఆదరించాలని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. దామోదర జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం జానపదం- సినీ పదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రమైక జీవనంలోనే ఆట పాట ఉందన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా ఎందరో కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో మహంతి వాసుదేవరావు, గిరిజన గీత శిల్పి బొండా జగన్మోహనరావు, డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కళాకారులు గిరీష్ కుమార్, సుశీల్ కుమార్, చక్రవర్తిలను గజల్ శ్రీనివాస్ సత్కరించారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు డాక్టర్ జయంతి చక్రవర్తి, భారతి, సిరిమోక్ష, తేజ, హంస్సేన్‌బీ, సాయి, శ్రీనివాస్, సునీల్, గణపతి గీతాలను ఆలపించారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు షష్టి పూర్తి సందర్భంగా అభిమానులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమాన్ని సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ నిర్వహించారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు
- పైపులైన్ విస్తరణ పనులు ప్రారంభం
- తాగునీటి మోటారు బోర్లు ఏర్పాటు
- వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం గుర్తింపు



మోటారు బోరు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో ఏళ్ల తరపడి ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలు పూర్తి స్థాయిలో తీరనున్నాయి.

గతంలో ఇలా..

సుమారు 25 వేల మంది జనాభా ఉన్న ఈ మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్యలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు గ్రామం మొత్తానికి 10 బోర్లు, చిన్నపాటి 4 ఓవర్ హెడ్ ట్యాంకులతోనే తాగునీరు సరఫరా చేస్తున్నారు. వేసవిలో కాల్వగట్టు ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు అందక అల్లాడిపోయేవారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా వాటర్ పైపులైన్ విస్తరణ, అభివృద్ధి పనులు జరగలేదు. దీంతో గ్రామంలో చాలా ప్రాంతాల్లో మోటారు బోర్ల ద్వారానే తాగునీటిని సరఫరా చేసేవారు. అధికంగా బోర్ల వినియోగంతో తరుచూ మరమ్మతులు, విద్యుత్ చార్జీలతో పంచాయతీకి భారంగా మారింది. ప్రజలు సురక్షిత తాగునీటికై మినరల్ వాటర్ క్యాన్లపై ఆధారపడాల్సి వచ్చేది.



తాగునీటి పైపులైన్ విస్తరణ పనులు చేస్తున్న కార్మికులు

స్పందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..

ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ సమస్యలన్నింటికి చెక్ పడనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మంజూరైన కోట్ల రూపాయల నిధులు వెచ్చించి తాగునీటి సమస్యను రూపుమాపేందుకు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించారు.

త్వరలో వాటర్ ట్యాంక్ నిర్మాణం..

గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌ల ద్వారా సరఫరా అయ్యే తాగునీరు చాలకపోవడంతో కొత్తగా వాటర్ ట్యాంక్ నిర్మించడానికి తీర్మానించారు. తాగునీటి కల్పనకు మంజూరైన నిధులలోనే 2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పంచాయతీ అధికారులు స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని 10 సెంట్ల కామన్ స్థలం ట్యాంకు నిర్మాణానికి అనువుగా ఉన్నట్లు గుర్తించి ఖరారు చేశారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నారు.

సుమారు రూ. 3 కోట్ల నిధులతో..

ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో వాటర్ పైపులైన్ విస్తరణ, నూతన మోటారు బోర్లు ఏర్పాటు, 2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణం నిమిత్తం రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే గ్రామంలోని నెహ్రూనగర్, రామానగర్‌లలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పైపులైన్ విస్తరణ పనులు ప్రారంభించారు. రామానగర్, మసీదు సెంటర్, నెహ్రూనగర్‌లలో నూతన మోటారు బోర్లను ఏర్పాటు చేశారు. ప్రధాన గ్రామంలో రూ.1.25 కోట్లు, నెహ్రూనగర్‌లో రూ.103.4 కోట్లు, రామానగర్‌లో రూ.55.4 లక్షల అంచనాతో పైపులైన్ విస్తరణ పనులు నిర్వహించేందుకు టెండర్ దశలో ఉన్నాయి. గ్రామం మొత్తం వాటర్ పైపులైన్ విస్తణ వల్ల ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు వీలు కలుగుతుంది.

త్వరలో టెండర్లు పిలుస్తాం..



గ్రామం మొత్తం వాటర్ పైపులైన్ విస్తరణ నిమిత్తం ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే రామానగర్, నెహ్రూనగర్‌లలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి వాటర్ పైపులైన్ పనులు నిర్వహిస్తున్నాం. మూడు మోటారు బోర్ల ఏర్పాటు కూడా పూర్తయ్యింది. మిగిలిన ప్రధాన గ్రామం, నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం నిమిత్తం అతి త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నాం. గత టీడీపీ ప్రభుత్వంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే సంకల్పంతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాం.

– శీలం రంగారావు, సర్పంచి, నిడమానూరు

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు





ఉంగుటూరు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ | ఆత్కూరు ఎస్‌ఐ పైడిబాబు

ఉంగుటూరు: ఉంగుటూరు ఎస్‌ఐగా వి.రవిచంద్రకుమార్, ఆత్కూరు ఎస్‌ఐగా ఎ.పైడిబాబు బాధ్యతలు స్వీకరించారు. మండల పరిధిలోని రెండు పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐలు బదిలీ కాగా వారి స్థానాల్లో వచ్చిన ఎస్‌ఐలు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఉంగుటూరు ఎస్ఐ జి.రాజు పెదపారుపూడికి బదిలీకాగా ఆయన స్థానంలో పెడన నుంచి రవిచంద్రకుమార్, ఆత్కూరు ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ పెడన వెళ్లగా బంటుమిల్లి ఎస్ఐ పైడిబాబు ఆత్కూరు స్టేషన్‌కు వచ్చారు.

పన్నుల విధింపుపై ప్రత్యేక డ్రైవ్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పన్నుల విధింపు పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన ఆదివారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కానూరు, యనమలకుదురు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో ఇంటి పన్నులు లేని వారు, ఖాళీ స్థలాలకు పన్నులు వేయించుకోని వారు వెంటనే పన్నులు వేయించుకోవాలని సూచించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ నెల 12వ తేదీన పన్నుల విధింపుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. పన్నుల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చూపరాదని హెచ్చరించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలి

గన్నవరం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో ప్రారంభమైన ర్యాలీ గ్రామ వీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా చిప్పాడ మాట్లాడుతూ..మంచి ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డాక్టర్ సురేంద్ర సూచించారు. అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు, విశ్రాంత గ్రంథాలయాధికారి వల్లభనేని సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న వాకర్స్

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

పెనమలూరు: క్యాన్సర్ వ్యాధి నివారణకు ప్రజల్లో అవగాహనకు ఆదివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు కానూరు 100 అడుగల రోడ్డు వరకు ర్యాలీ చేశారు. ప్రతి ఒక్కరూ శరీరంలో వచ్చే మార్పులు గమనించాలన్నారు. సరైన ఆహారం తీసుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



కానూరులో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నేడు ‘స్పందన’

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో అర్జీల ద్వారా అందజేయాలని తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎ.రమ్యశ్రీ తెలియజేశారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో అందజేయాలని ఎంపీడీఓ కోరారు.

భార్య, పిల్లల అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకిలో భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి జంగాల బజార్‌లో ఎస్.సత్యనారాయణ కుటుంబ సభ్యు లతో ఉంటున్నాడు. అయితే ఈ నెల 2వ తేదీన తన తండ్రి అమృతలింగాన్ని చూసే విషయంలో తల్లి సముద్రదేవి, భార్య లక్ష్మీప్రసన్నకు మధ్య గొడవ జరిగింది. దీంతో లక్ష్మీప్రసన్న అలిగి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లి పోయింది. దీంతో భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

భార్య అదృశ్యంపై..

పెనమలూరు: భార్య అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్ కు చెందిన నిసాద్ అనీల్‌కుమార్ తన భార్య రాజ్‌కుమారితో కలిసి పోరంకిలో ఉంటూ ఇరువురూ తాపీ పనులు చేస్తున్నారు. కాగా గత నెల 29వ తేదీన భర్త అనీల్‌కుమార్ పనికి వెళ్లగా భార్య ఇంట్లోనే ఉంది. భర్త పనులు ముగించుకొని ఇంటికి రాగా ఇంటికి తాళం వేసి ఉంది. భార్య కోసం వాకబు చేసినా ఆమె ఆచూకీ తెలియలేదు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

‘మానవత’ సంస్థకు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిస్వార్థంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థకు ప్రతి ఒక్కరూ సాయం అందించాలని దాత అల్లం దుర్గారావు అన్నారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖకు ఆయన రూ.33 వేలు విరాళాన్ని ఆదివారం అందించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు ఈ మొత్తాన్ని విజయవాడకు చెందిన దుర్గారావు అందించారు. హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

కిషోర్‌కు ఏఎన్‌యూ డాక్టరేట్



ప్రొఫెసర్ మధుబాబు నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కిషోర్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీఏఎస్.పురం కాలనీకి చెందిన కంపా కిషోర్‌కు అర్థశాస్త్రంలో ఆచార్య నాగర్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీ ప్రధానం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో అంతర్గత గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ పద్ధతులపై ఆరున్నరేళ్లుగా కిషోర్ చేసిన పరిశోధనలకుగాను డాక్టరేట్ లభించింది. ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాజశేఖర్‌బాబు పర్యవేక్షణలో ఆయన పరిశోధనలు సాగించారు. ఐటీడీఏ పరిధిలోని వెనుకబడిన గిరిజిన ప్రాంతాల్లో వ్యవసాయానికి దోహదపడే చెక్ డ్యామ్‌లు, ల్యాండ్ డెవలప్‌మెంట్, పోడు వ్యవసాయం ద్వారా భూసారాన్ని పెంచే పద్ధతులు, సాంకేతిక వ్యవసాయం తదితర అంశాలపై పరిశోధనలు చేశారు. వీటిపై అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ రంగంపై పరిశోధన పత్రాలను కిషోర్ సమర్పించారు. ఈ పరిశోధనలకు గాను ఆచార్య నాగర్జున విశ్వవిద్యాలయం ద్వారా ఫుల్‌టైం డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్‌ను ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ పి. రాజశేఖర్, ఆర్ట్స్ అండ్ కామర్స్, లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ చల్లపల్లి స్వరూప రాణి, అర్థశాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కే.మధుబాబు తదితరులు అభినందించారు.

ముమ్మరంగా రిజిస్ట్రేషన్లు



మానికొండలో రిజిస్ట్రేషన్ల తీరును పరిశీలిస్తున్న డీటీ శ్రీలత

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలలో భాగంగా ‘పేదలందరికి ఇళ్లు’ పథకం లబ్ధిదారులకు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. బాపులపాడు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆదివారం కూడా పేదలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లును అధికారులు నిర్వహించారు. మండలంలో సుమారు 100 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న కాలనీల కింద మొత్తం 29 లే అవుట్లను అభివృద్ధి చేసి 3315 మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ లబ్ధిదారులకు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మండలంలో సుమారు 1400 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసినట్లు అధికారులు తెలిపారు.

ఉంగుటూరు: మండలంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారుల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంవంతంగా జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ నమోదును డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రిజిస్ట్రేషన్ నమోదు పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపడతున్నారు. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి రిజిస్ట్రేషన్లు కొనసాగిస్తున్నారు. లబ్ధిదారులు ఉత్సాహంగా తమ పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.

రూ.1.38 కోట్లతో హైస్కూల్ అభివృద్ధి

శరవేగంగా జరుగుతున్న పనులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం శరవేగంగా సాగుతోంది. గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ ఏడేళ్ల క్రితమే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ సొంత భవనాలు లేకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎంపీయూపీ స్కూల్ ప్రాంగణంలోనే హైస్కూల్ తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మల్లవల్లి జెడ్పీ హైస్కూల్‌కు సొంత భవనాలు నిర్మాణానికి నిధులు కేటాయించారు.

ఐదెకరాల సువిశాల ప్రాంగణంలో నిర్మాణం..

మల్లవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌కు ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. 2017లో జెడ్పీ హైస్కూల్ ఏర్పడగా ప్రస్తుతం 250 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జెడ్పీ హైస్కూల్ తరగతి గదుల నిర్మాణానికి రూ.1.38 కోట్ల నిధులు మంజూరు చేసింది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో నూతన భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. హైస్కూల్‌కు తొలి విడతలో 12 తరగతి గదుల నిర్మాణంతో పాటుగా, మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుంది. టాయిలెట్లు, తాగునీరు, విద్యుద్దీకరణ, తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటుతో పాటు పాఠశాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టనున్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి పాఠశాల భవనాలు సిద్ధం చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టారు.



నిర్మాణంలో ఉన్న మల్లవల్లి జెడ్పీ హైస్కూల్ భవనం

భక్తిశ్రద్ధలతో తండులార్చన



సత్యసాయి మందిరంలో తండులార్చిన కార్యక్రమంలో విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లిలోని శ్రీ సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీ సత్య సాయి విద్యా విభాగం ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి గాయత్రీ తండులార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వశాంతి కోరుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరుతూ పూజలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమితి ఆధ్యాత్మిక సహసమన్వయకర్త, శ్రీ సమయ మంతుల వెంకట చెన్నయ్యగుప్తా తెలియజేశారు. తొలుత ఎం కొండలరావు, గంగా భవాని దంపతులు, సింధుజ, విశాలి, సాయి గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. వేదాధ్యయన విభాగ బ్రహ్మశ్రీ పాతూరి జ్ఞానేశ్వరి శర్మ, వేదక్తంగా గాయత్రీ మాతకు పూజలు చేశారు. అనంతరం సమితి కన్వీనర్ పోతుకుచి ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ పిల్లలు సకాలంలో ఆహారాన్ని తీసుకునేలా చూడాలని తండులార్చన నిర్వహించినట్లు తెలిపారు. గుడివాడ సత్య సాయి సేవాసమితి కన్వీనర్ రవికుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 18 ఆదివారం గుడివాడ లో శ్రీ సత్య సాయి శత రుద్రయం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమితి ఆధ్యాత్మిక సమన్వయకర్తలు వై.సాయిబాబు, తుర్లపాటి గిరీష్ బాబు, వై.మణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో గురువులు, తల్లిదండ్రులు భక్తులు పాల్గొన్నారు.


సండే @ స్మృతివనం

విజయవాడ నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో సందడి నెలకొంది. ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో స్మృతివనం ప్రాంగణమంతా కిటకిటలాడింది. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, వివిధ ఆకృతులను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. సాయంత్రం విద్యుత్ వెలుగులలో స్మృతివనం విశేషంగా ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









నగర వాసులకు జాతీయ స్థాయి పురస్కారాలు



అవార్డులు పొందిన మేడా సింధూశ్రీ, లోకేష్ బాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ నగరానికి చెందిన మేడా సింధుశ్రీ, లంకే లోకేష్ బాబుకు తెలుగు వెలుగు సంస్థ అందజేసే జాతీయస్థాయి పురస్కారాలు దక్కడం చా లా సంతోషంగా ఉందని స్ఫూర్తి క్రియేటివ్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ అ న్నా రు. చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్టస్, పేపర్ క్విల్లింగ్ అంశాల్లో ప్రతిభ చూపినందుకు సింధుశ్రీకి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం, ఫొటోగ్రఫీ, విజువల్ కమ్యూనికేషన్ రంగంలో ప్రతిభ చూపినందుకు లంకే లోకేష్‌బాబుకు తెలుగు వెలుగు స్ఫూర్తి కళారత్న జాతీయ పురస్కారాలు అందుకున్నారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏటా ఈ పురస్కారాలను అందిస్తారని వివరించారు. తెలంగాణలోని యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హన్మకొండలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో ఆదివారం ఈ పురస్కారాలను సింధుశ్రీ, లోకేష్‌లకు అందజేశారని శ్రీనివాస్ తెలిపారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పాలోజు రాజ్‌కుమార్, తెలుగు వెలుగు వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్, యువత చైతన్య వెల్ఫేర్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు అందజేశారని చెప్పారు.